మేరీ ఔరత్

[కథానిక]

= శ్రీ మునిమాణిక్యం నరసింహారావు =

"రైలుటైము అయింది. తొందరగా వెళ్లాలె. ఆ రెండు ధోవతులు చాలవు. ఇంకా రెండు వెయ్యి. లాల్చీలు ఎన్ని వేశావూ? మూడా? ఏమిటి నీ ఉద్దేశం? రోజుకు ఒకటైనా కావాలా? వెయ్యి ఇంకా రెండు."

"ఎందుకండీ ఇవన్నీ? ఎక్కడైనా పారేసివస్తారు."

"ఎక్కడైనా పారేసివస్తానూ? అంటే... నేను శుద్ధ తెలివితక్కువవాణ్ని అన్న మాట! ఊరికెళ్లినప్పుడల్లా పారేసుకొస్తున్నానా?"

"ఎప్పుడూ పారేస్తున్నారని కాదండీ."

"మరేమిటి, ఎందుకు వద్దనటం?"

"రెండురోజుల ప్రయాణానికి ఇన్ని బట్టలు ఎందుకు, ఏదో క్లుప్తంగా తీసికెడితే చాలదా అనీ నే ననటం."

"అంటున్నావులే. ఆ అనటంలోనే నేను తెలివితక్కువవాణ్ని అయినట్లు తేలుతున్నది. ప్రతి ఆడదీకూడా తన మొగుడంత తెలివితక్కువవాడు ఈ ప్రపంచంలో ఇంకొకడు లేడనుకొంటుంది."

"నే నేమీ అనుకోటం లేదండీస్వామీ. మీ ఇష్టం వచ్చినన్ని తీసుకెళ్లండి. ఊరికే జాగ్రత్తకోసం చెప్పాను. దాని తరువాత మీ ఇష్టం."

అని వెళ్లిపోయింది కాంతం. అల్లాగ వెళ్లిపోవటం మటుకు నాకు చాలా విచిత్ర మనిపించింది. ఎందుకంటే- మా ఆవిడ... అంత సులభంగా వదిలేసే మనిషి కాదు. పోట్లాట వచ్చిందంటే మరీ పెంకెపట్టు. సాధారణంగా లోకంలో భార్యలు భర్తలతో పోట్లాడుతూనే ఉంటారు. అందులో మా ఆవిడ సెకండుఫ్రంటు కూడా ఓపెన్ చేసింది. గదిలో పోట్లాట ప్రారంభిస్తుంది. ఎట్లాగో తప్పించుకొని బైట పడితినా, నడవలో మళ్లీ ఎటాక్ చేస్తుంది. అల్లాంటి మనిషి మరి ఇల్లాగ నన్ను వదిలేసి వెళ్లిపోవటం ఆశ్చర్యం కలుగజేసింది అంటే చేయదూ?

సరే నని, కావలసిన బట్టలూ అవీ తీసుకొని సూటుకేసులో పెట్టి బెడ్డింగు తయారు చేసికొన్నాను. అంతా సిద్ధం అయినతరువాత కాంతాన్ని పిలిచి "ఏదీ..."అన్నాను- రూపాయి మోగించటం చూపిస్తూ.

ఆవిడ సూటుకేసువంక ఒకసారీ, బెడ్డింగువైపు మరోసారీ చూచి,ఆతరువాత నవ్వుతూ నాకేసి చూస్తూ నిలబడింది.

ఈచిరునవ్వులకు అర్థాలు నాకు తెలియకపోలేదు. ఊరుకొన్నాను.

"ఎందుకండీ సూటుకేసూ, బెడ్డింగూ కూడానూ? సూటుకేసులో ఉన్న ఆ నాలుగు బట్టలూనూ బెడ్డింగులో వేసుకొంటే మీకు తేలికకదూ"" అన్నది.

నిజమే ఆమాట. తెలివితక్కువగా రెండుసార్లీలు తయారుచేశాను. వీటిని రైళ్లల్లో ఎక్కించటానికీ, దింపటానికీ కూలీ ఇవ్వాలె. బోలెడు శ్రమానూ. కాని నాకు ఆమాత్రం తోచింది కాదు.

"వచ్చావూ? ఏదో ఒక వంక పెడటానికి! సరే. రాణీసాహెబావారి ఆజ్ఞ ఏమిటో సెలవియ్యండి" అన్నాను.

"సరె సరె లెండి. నేను రాణీనీకాదూ, సాహేబునూకాదు. మీరు ఎంతలోకి సాయిబు అవుతారు!" అన్నది.

ఆవిడ అక్కడ నిలబడి చూస్తుండంగానే, సూటుకేసులోని బట్టలు తీసి బెడ్డింగులో పడేసి ప్రయాణానికి సిద్ధమైనాను. "నాన్నా, ఒకజట్కా పిలూ" అని కేకేశాను మా అబ్బాయికోసం.

మరిరెండు నిమిషాల్లో జట్కా ఇంటిముందు నిలబడింది. నేను ఎక్కి కూర్చున్నాను. కాంతం వాకిట్లోకి వచ్చి, "జాగ్రత్తగా రండి. శాలువకూడా తీసుకెడుతున్నారు." అన్నది ఆదుర్దాగా చూస్తూ. ఆశాలువ పారేస్తాననే ఆమె అనుకోటం. పారేయటం కొంచెం హెచ్చుతగ్గుగా నిశ్చయమనేఊహించి "జాగ్రత్త, జాగ్రత్త" అంటూనే ఉంది. నేను బండివాడితో "పోనియ్యవోయ్" అన్నాను. బండి సాగిపోతున్నా కూడా ఆవిడ, "ఏమండోయ్, జాగ్రత్తసుమండీ, బెడ్డింగు ఎక్కడైనా విడిచివచ్చేరు. తువాలాలూ అవీ ఉన్నయి." అంటూ చెప్పింది.

బండి దుకాణాలు దాటి మలుపు తిరిగింది. ఇంతలో మా రాధాయ పరుగెత్తుకుంటూ వస్తున్నాడు. వాడు రొప్పుకుంటూ వచ్చి "అమ్మ ఒకసారి రమ్మంటున్నది" అని చెప్పాడు. నేను విసుక్కుంటూనే దిగి వెళ్లాను. ఆమె లోపలికి తీసికెళ్లి, "డబ్బు తీసుకోకుండా వెడుతున్నారేం" అన్నది. పర్సు జేబులో వేసుకొన్నాను గాని ఆవిడ నడిగి డబ్బు తీసుకోటం మరిచిపోయినాను.

"నయమే, ఏదీ ఇయ్యి" అన్నాను.

"ఎంత ఇయ్యమంటారూ?"

"పాతిక ఊ, చప్పున ఇచ్చేసెయ్యి"

"పాతి కెందుకండీ—రాజమండ్రి వెళ్లి రావటానికి?"

"అక్కడినుంచి యకాయకీనీ బెజవాడ-మీదుగా నరసారావుపేట వెడతాను. అమ్మాయిని చూడటానికి."

"ఒక్కమాట వినండి-మీరు చాలా రోజులు ప్రయాణం చేయలేరు. రాజమండ్రి నుంచి ఇల్లా వచ్చి రెండురోజు లుండి, ఆతరవాత అమ్మాయిదగ్గరకు వెళ్లండి. ఈలోపున దాని కోచీర కొని ఉంచుతాను. నా మాట విని ఈపదీ తీసుకెళ్లండి. మిగతా పదిహేనూ నాదగ్గ రుంచైై" అని బ్రతిమిలాడింది.

నేను ఆవిడచేతిలో ఉన్న కాయితాలన్నీ లటిక్కిన లాక్కుని పర్సులో పెట్టుకొని – "నీవు ఊరుకో. నా కేం ఫరవాలేదు. మళ్లీ ఇటు రాను. ప్రోగ్రాము ఒకమాటు స్థిరపడిం తరువాత మార్చటానికి వీల్లేదు" అని అధికారిలాగ అన్నాను. ఆవిడ చిన్నబుచ్చుకొని "సరే, మీ ఇష్టం" అని

నన్ను వీథిలోకి పంపి, ఇంకోసారి "జాగ్రత్త" అని చెప్పి దీనంగా చూసింది. నేను నవ్వుతూ బండి ఎక్కి 'ఊ' అన్నాను. "మళ్లీ ఎప్పుడొస్తారూ?" అని ఆవిడ అడిగింది బండి సాగింతరువాత. "రేపు రాజమండ్రిలో ఉంటా ననుకో. అక్కడినుంచీ నరసారావుపేట వెళ్లి రెండురోజు లుండి నాలుగోనాటికి తిరిగివస్తాను" అన్నాను. "అమ్మాయి చేతులో ఆపదిరూపాయలూ పెట్టండి. ఇంకో విధంగా ఖర్చుచేయక" అని కేక వేసింది. నేను తల ఊపి ఊరుకొన్నాను.

ఆ వెళ్లటం వెళ్లటం నేను రాజమండ్రి పోయినాను. అక్కడికి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందీ అంటే — కాంతంస్నేహితురాలు ఒకర్తె అక్కడ శానిటోరియంలో ఉంది. ఆమెను చూడాలని కాంతం తహతహలాడింది. ఆమెవెడితే నేనూ వెళ్లాలె. ఇద్దరం వెడితే డబ్బు ఎక్కువ కర్చు అవుతుందని నేను ఒకడ్నే చూచివస్తానని మా ఆవిడకు చెప్పాను. ఆవిడ సరేనని ఒప్పుకొన్నది. అదీ నాప్రయాణానికి కారణం. డబ్బు కర్చు తగ్గించే ఏవిషయమైనా కాంతానికి ఇష్టం. నేను కూడా ప్రతివిషయంలోనూ ఇప్పుడు జాగ్రత్తగా ఉంటున్నాను.

రాజమండ్రిలో దిగి దగ్గరలో ఉన్న కాఫీహోటలులో ఒక్క ఇడ్డెను, అరకప్పు కాఫీమాత్రమే పుచ్చుకొన్నాను. "డబ్బు జాగ్రత్తగా వాడండి" అని కాంతం నొక్కి నొక్కి చెప్పినమాటలు నేను మరిచిపోయి ఎక్కువ సొమ్ము పాడుచేయటం తప్పు అని తోచింది. ప్రయాణం పొడుగునా నేను ఒక్క దమ్మిడీఅయినా అనవసరంగా కర్చు చేయదలుచుకోలేదు.

అటుతరువాత మా ఆవిడస్నేహితురాలిని చూడటానికి శానిటోరియముకు బయలుదేరాను. శానిటోరియం వీరభద్రాపురానికి రెండుమైళ్ల దూరంలో ఉందని తెలిసింది. నడిచివెళ్లటం కష్టం అని తోచింది. అదీకాక ఎండ తీక్షణంగా ఉండేలాగ కనుపించింది. అది మాఘమాసం. పగలు మండు టెండ, రాత్రిళ్లు చలీనూ. బండొకటి మాట్లాడుకొని వెడదా మనుకొన్నానుగాని, రానూ పోనూ రూపాయిన్నరకు తక్కువైతే బండి కట్ట నన్నారు. రూపాయిన్నర కర్చుచేయటానికి ఏమాత్రం మనస్సొప్పలేదు. ఒక్క నిమిషం తటపటాయించి గిరుక్కున తిరిగి వీరభద్రాపురందారి పట్టాను. వీథులలోదుమ్ము ఎత్తిపోస్తున్నది. పోనుపోను ఆదుమ్ము మరీ ఎక్కువైంది. నడిచీ నడిచీ సుమారు పదకొండుగంటలకు శానిటోరియం చేరాను.

ఒక మిట్టపై నున్న ఆవైద్యశాలలో అన్ని ఏర్పాట్లూ ఎంతో బాగా ఉన్నాయి. క్షయదగ్గు మహాభయంకరమైన వ్యాధి అనీ, ఆరోగులు పీనుగులలాగ ఉంటారనీ అనుకొన్నాను కాని అక్కడున్న రోగులలో చాలామంది మంచి మనుష్యులలాగే కన పడ్డారు. శేషమ్మగారూ, ప్రయాగమ్మగారూ కూడా ఆరోగ్యంగానే కనిపించారు. కాని ప్రయాగమ్మగారు అతఃపూర్వపురాత్రే నెత్తురు కక్కుకొన్నదట. క్షయదగ్గు మహాతమాషా అయిన జబ్బు. ఆరోగ్యంగా ఉన్నట్లే ఉండి పుటిక్కున తాడు తెంచుతుంది. వాళ్లతో కబుర్లు చెబుతూ ఒంటిగంటదాకా గడిపాను. అక్కడినుంచి వాళ్లకు విశ్రాంతి సమయము. ఎవ్వరూ అక్కడ ఉంటానికి వీలులేదు. అంచేత నేను

వాళ్లతో చెప్పేసి ఊళ్లోకి వచ్చేసరికి మూడుగంటలైంది. హోటల్లో ఒక రకం భోజనం ఆరు అణాలనీ, మరోరకం పావలా అనీ చెప్పారు. ఇందులో రెండోరకం భోజనంతోనే తృప్తిపొందాను. బెజవాడ వైపు వెళ్లే రైలు ఒకటి నాలుగు గంటలకే ఉందని తెలిసింది. వెంటనే స్టేషనుకు వెళ్లి టిక్కెట్టు కొని, రైలులో చేయవలసిన ప్రయాణం అంతా చేసి పడవలసిన అవస్థలన్నీ పడి, ఆరోజు రాత్రికే ఇంటికి వెళ్లవలసినవాణ్ణి మర్నాడు పది గంటలకు కొంపజేరాను.

౨

బండి ఇంటిముందు ఆగటంతోటే చిన్నపిల్లలు ఇద్దరూ వచ్చి బండిదగ్గర నుంచున్నారు. పెద్దపిల్లలు ముగ్గురూ వీధి వాకిట్లో నుంచుని, "అమ్మా, నాన్నొచ్చారేవ్" అని కేక వేశారు. నేను బండి దిగి ఇంట్లోకి అడుగు పెట్టగానే వంటఇంట్లోనుంచి మా ఆవిడ రావటంకనపడ్డది. "అప్పుడే వచ్చారేం? అమ్మాయి అత్తవారింటికి వెళ్లలేదా" అని రెండు ప్రశ్నలు నామీద విసిరి, నేను ఏమీ చెప్పకముందే బండివాడితో "బెడ్డింగు బండిలో ఉంది కాబోలు, తీసుకొని రావేమి అబ్బాయ్" అన్నది. "అయ్యగారు బెడ్డింగూ ఏమీ తేలేదండి" అంటూ వాడు బండి కిరాయి పుచ్చుకొని వెళ్లిపోయినాడు. కాంతం తెల్లపోయి నావంక జూచి, "బెడ్డిగు ఏమి చేశారు?" అని అడిగింది. ఊరికే మాటవరసను అల్లాంఅడిగిందే గాని, నేను ఆ బెడ్డింగు ఎక్కడో పారేసివచ్చానని ఆవిడగారు ముందుగానే నిశ్చయించుకొంది. నేనన్నానూ- "ఊరికే హడలిపోబోకు. బెడ్డింగు వెనకనుంచి వస్తూంది" అని. "ఎక్కడైనా వదిలివేసి వచ్చారా" అని మళ్లీ అడిగింది కొంచెం ఆశతో. నేను నవ్వి 'అవును' అని వంటింటివేపు నడిచాను. ఆవిడ సంగతి గ్రహించి "స్నానం చెయ్యండి" అంది. నేను వెంటనే స్నానం కానిచ్చి పిల్లలతో కలిసి భోజనం చేస్తున్నప్పుడు కాంతం మళ్లీ, "ఏమండీ, అమ్మాయిదగ్గరకు వెళ్లలేదేం" అన్నది. "ఏదో ప్రయాణం చేయలేకపోయినాను. రాజమండ్రినుంచి ఇల్లా యకాయకీని వచ్చేశాను. రెండురోజులుండి కాస్త బడలిక తీర్చుకొని వెడతాను" అన్నాను. "ఆబెడ్డింగు బెజవాడలో పారేసి వచ్చారు కామోలు" అంది. నేను నవ్వి ఊరుకొన్నాను. "శాలువా అవీ జాగ్రత్తగా ఉన్నవికదా" అని మళ్లీ అడిగింది- నాకు కోపం వస్తుందేమోనని కొద్దిగా భయపడుతూనే. "ఎందుకే హడలిపోతావు కాంతం? నే నేదన్నా తీసికెడితే మళ్లీ ఇంటికొస్తుందని నీకు నమ్మకం లేదన్నమాట!" అన్నాను. ఆవిడ ఆమాటమీద కాస్త నొచ్చుకుని "ఆ, అదిగాదండీ, ఊరికే అడిగాను. మరేం లేదు. సరేకానీండి, మీరు రాజమండ్రిలో ఎప్పుడు బయలుదేరారూ?" అని విషయంమార్చింది. "చెప్పవలసిన సంగతులు చాలా ఉన్నాయి. భోజనం అయినతరువాత చెప్వాతా"నంటూ పెరుగూఅన్నమూ తినేసి నేను ముందుగా వెళ్లి పడకకుర్చీలో కూలబడ్డాను. ఒక్కగంటసేపు కునుకుపట్టింది. అప్పటికి కాంతం వచ్చి తమలపాకులూ వక్కలూ నాముందు పెట్టి "ఆ, ఏమిటండీ సంగతులు" అంటూ చాపమీద కూర్చున్నది. నాదగ్గరనుంచి వెంటనే జబాబు రాకపోవటం కనిపెట్టి ప్రయాణం సంగతులు ఏమిటండీ? ఎప్పుడు

బయలుదేరారు రాజమండ్రీలో" అని మళ్లీ అడిగింది.

"నిన్న నాలుగుగంటలకు గోదావరి స్టేషనులో రైలు ఎక్కాను."

"అయితే రాత్రి బెజవాడలో ఆగారన్న మాట. రంగయ్య అన్నయ్యఇంట్లో ఉన్నారా? మాతమ్ముడింటి కెళ్లారా!"

"రంగయ్యఇంటికీ కాదు ... మాతమ్ముడింటికీ కాదు"

కాంతం తెల్లపోయి "అయితే హోటల్లో ఆగారన్నమాట. పక్కచుట్టకూడా ఆహోటల్లోనే పారేసివచ్చారా?" అని భయాన్ని కనపరిచింది.

"వీలు చిక్కితేసరి, నేను పారేసేననే అంటావు!"

"మరి హోటల్లో - పదిమంది వచ్చిపోయే చోట - నిక్షేపమంటి బెడ్డింగు - శాలువ కూడా ఉందేఅందులో-వదిలేసివస్తారటండి?"

"పోట్లాటకు తయారై కూర్చోకూ. అసలు నేను హోటల్లో వదిలేసివచ్చానని ఎవరు చెప్పారూ."

"ఆఁ, అయితే ఎక్కడ తగలేశారూ!" అన్నది ఆవిడ భయమూ, విచారమూ సూచిస్తున్న గొంతుకతో.

"నీవు...ఎగిరిపడక..."

"నేను అనుకుంటూనేఉన్నాను."

"ఊరుకో ... ఊరుకో ... ఎక్కడికీ పోలేదు బెడ్డింగు. రెండురోజులలో వస్తుంది. కొన్ని కారణాలచేత ఒక స్నేహితునివద్ద వదలవలసి వచ్చింది." అని శాంతంగా జవాబు చెప్పాను.

"ఏమి టా కారణాలు?"

"అదీ అడగవలసిన ప్రశ్న. అట్లా అడుగూ చెపుతాను" అని ప్రారంభించాను. "ఇక్కడనుంచి వెళ్లానా రాజమండ్రి? మా శేషమ్మను చూశాను."

"కులాసాగా ఉందా?"

"ఆ—సుఖంగా ఉంది. నీవు ఆదుర్దా పడాల్సింది ఏమీ లేదు. చూచి ఆ రోజు-అంటే నిన్న సాయంత్రమే బయలుదేరాను."

"పనసపొట్టు కొనమంటిని గదండీ."

"కొనటానికి వీలులేకపోయింది."

"ఆ, నా బొంద, వీలులేకపోవటం ఏమిటి? పిల్లలకు ఎంతో ఇష్టం. ఇక్కడ దొరుకుతుందా ఏమన్నానా! చెప్పినమాట వినరామె!"

"నీ మాట వినాల్సిరావటంచేతనే అది కొనలేదు."

"అదేమిటండీ?—"

"చెపుతా ఏమిటో—చెప్పనిస్తేగా?"

"ఊఁ........"

"నేను ఆసుపత్రి కెళ్లొచ్చేసరికి మూడు గంటలైంది. కొనాలంటే పనసపొట్టు ఊళ్లోకి పోవాలి. అల్లాగ వెడితే ఆపూటరైలుఅందేది కాదు. ఆ రాత్రి అక్కడుంటే పూటకూళ్లింటికి పావలా, పడుకొనేందుకు గదికి అద్దె అర్ధరూపాయి—ముప్పావలా దండుగ.అందుకని వెంటనే ఉన్న బండిలో రావటం గలిగింది."

"సరే. అల్లాగయినా రాత్రికి రావలసింది. ఈ పూట వచ్చారేం?—బెజవాడలో హోటల్లో తగలేశారు! ఎక్కడైతేనేం?"

"లేదు. బెజవాడ వెళ్లనేలేదు."

"అయితే--ఎక్కడున్నట్లూ?" అన్నది ఆశ్చర్యంతో.

"ఆ సంగతే చెపుతాను. నీవు కొంచెం ఓపిగ్గా వినాలె."

"ఒక కథలాగ అన్నమాట."

"ఊఁ. అల్లాగే అనుకో" అన్నాను నేను.

"సరే కానివ్వండి." అన్నది ఆవిడ.

"రాజమండ్రి నుంచి బందరు రావటానికి రెండు మార్గా లున్నవి. బెజవాడ మీదుగా రావటం ఒకటీ, భీమవరం మీదుగా రావటం మరొకటీ."

"మీరు బెజవాడ మీదుగా రాలేదని చెపితిరిగా."

"బెజవాడ మీదుగా రాలే దన్నాను గాని భీమవరం మీదుగా వచ్చానని చెప్పానా ?"

"ఊఁహూ...ఇప్పుడు చెప్పండి."

"అదే భీమవరంమీదుగా వచ్చాను. ఆ రావటంలో..."

"నిడదవోలుమీదుగా వచ్చారు. అంతే గదూ. మీరు ఊరికే గాలి పోగుజేసుకొని కథ అల్లుకొంస్తారు. వినేవాళ్లకు విసుగొస్తుంది. మీ కేం? ఇంతకూ ఆబెడ్డింగు ఎవరింట్లో పడేసివచ్చారో చెపితే నేనెల్లి కాస్త నడుము వాలుస్తా."

"సరే, నీ వింత తొందరపడుతున్నావు కాబట్టి రాజమండ్రినుంచి నిడదవోలుదాకా జరిగిన విశేషాలు వదిలేస్తున్నాను. అయితే ఒక్కటి. డబ్బు కలిసివస్తుందని రాజమండ్రి నుంచి నిడదవోలుకు ఓ టిక్కెట్టు కొనుక్కొని అక్కడినుంచి భీమవరానికి మరోటి కొన్నాను. ఎందుకో తెలుసునా? ఇది నయం. విడివిడిగా కొనటంవల్ల ఓ అరణాలు కలిసొస్తయి" అని ఆవిడవంక చూశాను నన్ను మెచ్చుకొంటుందని. ఆవిడ "ఊఁ, కానివ్వండి" అన్నది ఓమోస్తరు విసుగుతో, ఆవలించి చిటికవేస్తూ. "మరి శ్రమ అయినా ఇల్లాగ విడివిడిగా...టిక్కెట్టు పుచ్చుకొని రావటం-సొమ్ము దమ్మిడీకూడా అనవసరంగా పాడుజేయకపోవటం-చూశావా మరి ! !"

అన్నాను. ఆవిడ కొంచెం నవ్వి చాలా మంచిపని చేశారు" అని నొక్కి అన్నది. "అదే-ఆకాస్త మాటకోసమే నేను పరితపిస్తున్నా" అని ఆమెబుగ్గను తర్జనితో తాకాను. 'ఊఁ' అని విసుక్కొంది. ముద్దుకు అలా అన్నా నన్నాను.

"ఇంకా ముద్దులూ ముక్కలూనూ!"

"ఏం!"

"పెద్దవాళ్ల మైపోవటంలే!"

"అల్లా అనకు. ఏముద్దు కాముద్దే! పడుచుదనపు మిసమిసలు ఎంత ముద్దో, ముసలితనపు ముడతలూ అంతే ముద్దు. వృద్ధాప్యంమటుకు ముద్దయిన కాలంగదూ"-

"అయితే కావచ్చు. మీరు ఈగొడవలోకి దిగక ఆపరుపుచుట్ట ఎక్కడ పారేసి వచ్చారో చెప్పండి."

"అదుగో పారేశారనే నీ వనుకోటం-!"

"నా అనుకోటంతో మీ కెందుకండీ-వేపూళ్లో ఎవరింట్లో పడేసివచ్చారో చెప్పండి-నన్ను వేధించక."

"ఆసంగతి నన్ను చెప్పనిస్తేనా ? ఫలానిచోట దిగబెట్టి వచ్చానూ అంటే అక్కడికెందు కెళ్లారూ అంటావు. అందుకని నే చెప్పదలుచుకొన్న రీతిని చెప్పనియ్యి."

"అల్లా అయితే సరే—"అని దగ్గరలో నున్న పట్టెమంచం వాల్చుకొని పడుకొని - "ఇక మీ ఇష్టం" అన్నది. నేనూ ఒక్క సిగిరెట్టు వెలిగించాను.

3

"భీమవరం చేరానా... అక్కడే గొడవ జరిగింది. కిటికీదగ్గిర కెళ్లి అందరిలాగే టిక్కెట్టు అడిగితే ఆయన ఇయ్యక, 'అటు తిరిగి రండి లోపలికి' అన్నాడు."

"ఎంచేతా?"

"అదే తమాషా. అందరికిమల్లే నాకూ ఒక టిక్కెట్టు తీసి ఇస్తే, చెప్పే దేముంది? సరే లోపలికి వెళ్లాను. 'కూర్చోండి మాస్టారూ. ఈనలుగురినీ పంపించి మీతో మాట్లాడతానూ' అన్నాడు."

"ఇంతేగదా. వాడెవరో దరిద్రుడు మీ దగ్గర చదువుకొని ఉంటాడు."

"సరిగ్గా అంతే. నాకైతే జ్ఞాపకంలేదు. వాడు ఆనలుగురినీ పంపించి నాదగ్గర కొచ్చి క్షేమం అడిగి, టీ ఇప్పించి, ఎంతో గౌరవించాడు."

"సరే-మామూలే."

"అవునా, ఆపళంగా, బందరు కో టిక్కెట్టు ఇయ్యమంటే ఇయ్యడే-"

"ఓహో—ఆరోజుకు...అదే ఆపూటకు వాళ్ల ఇంట్లో భోజనం చెయ్యమని కూర్చున్నాడు కామాలు."

"కాదు, కాదు. 'ఎకాయెకీని బందరు వద్దండి మాస్టారూ. కైకలూరుదాకా తీసికోండి. అక్కడినుంచి మళ్లీ ఇంకోటిక్కెట్టు కొనండి. మీకు ఓపావలా కలిసొస్తుంది' అన్నాడు. 'వద్దుఓయ్—ఈ గొడవంతా నేను పడలేను. ఇప్పటికి పడ్డది చాలూ. బారు టిక్కెట్టు ఇవ్వవయ్యా' అంటే-'అల్లా నేనెప్పటికీ ఇవ్వనండీ. రేపు ఎప్పుడైనా కనపడ్డప్పుడు పిన్నిగారు-'ఏమోయ్, నీకైనా తెలియదా? మాస్టారికి పావలా దండుగ బెట్టించావు' అంటే నే నేమనేది చెప్పండి? అన్నాడు. 'అయితే...నీకు మాఆవిడకూడా తెలుసన్నమాట' అనేసరికి ఆకుర్రాడు 'సారి! బాగుందండోయి మాస్టారూ. మీరు అంతా మరిచిపోయినా రన్నమాట. నేను మీరున్న ఇంట్లో వీథి గదిలో ఉండేవాణ్ని. మీకు కూరలూ అవీ నేనే తెచ్చేవాణ్ని. పండగ పండగకూ మీ ఇంట్లోనే భోంచేసేవాణ్ణి. నేను సుందరాన్నండీ మాస్టారూ' అన్నాడు. 'ఓయ్ నువ్వటోయ్' అని నేను వాడి వీపుమీద చరిచాను— అప్పటికి జ్ఞాపకంవచ్చినవాడిలాగ, నిజానికివాడెవరోఅప్పటికీ ఇప్పటికీనాకు జ్ఞాపకంరానేలేదు.అంతటితో వాడు ఊరుకోక 'పిన్నిగారు నాచేత కూరలూ అవీ తెప్పించేటప్పుడు ఒక్క దమ్మిడీ ఎక్కువ ఖర్చుచేస్తే కూకలేస్తుండేవారు. ఒకటండీ మాస్టారూ, మీరు చెప్పిన చదువువల్ల నాలుగు డబ్బులు సంపాదించటం నేర్చుకొంటే, వారు చెప్పిన చదువువల్ల నాలుగు రూపాయలు వెనకేసుకోటం నేర్చుకొన్నానండీ' అన్నాడు."

"ఎవరండీ ఆ అబ్బాయీ, అయినా సంవత్సరాని కో కుర్రాడు, ఎవరో ఒకరు మన ఇంట్లో తిరుగుతూ ఉంటాడాయె. జ్ఞాపకం ఉండదు. అయినా మీకంటే వాడే నయం."

"సరే. టిక్కెట్టు కైకలూరుకే తీసుకోక తప్పింది కాదు. ఆ కుర్రాడు నన్ను రై

తక్కించి 'కైకలూరులో బండి చాలాసేపు ఆగుతుందండీ. మీరేమీ తొందరపడాల్సిన అగత్యంలేదు.' అని చెప్పి వెళ్లిపోయినాడు. దాని తరువాత..."

"అబ్బబ్బ! ఏదో కథలాగ ఎందుకండీ ఈగొడవంతానూ."

"కొంచెం ఓపిక పట్టు నువ్వూ."

"ఇంతకూ ఆ బెడ్డింగు కైకలూరులో ఎక్కడైనా వదలి వచ్చారా?"

"అవును. కైకలూరులో ఒకాయనకు ఇచ్చివచ్చాను."

"ఎందు కిచ్చారు?"

"అదే- ఆప్రశ్నకే నేను సమాధానం చెప్పాలె. తొందరపడితే ఎల్లాగ? కైక లూరులో దిగి టిక్కెట్టు కొంటానికి వెళ్లాను. కిటికీదగ్గర జనసమ్మర్దన ఎక్కువగా ఉంది. ఎట్లాగో తోసుకెళ్లి టిక్కెట్టుకొని పరుగెత్తు కొంటూ రైలుదగ్గరకు వచ్చేశాను."

"రైలు అందలేదు కామాలు."

"ఊఁ— రైలు అందకేం— చక్కగా అందింది. కాని తరవాత సిగరెట్టు కొను క్కుందామని మనీపర్సుకోసం జేబులో చెయ్యి పెడుదును గదా..."

"ఊఁ" అన్నది కాంతం హడలిపోయి.

"పర్సు కాస్తా కనపడలేదు."

"అయ్యో, అయ్యో, పర్సు పారేశారు టండీ? నన్ను తగలెయ్య ... అయ్యయ్యో. మొర్రో వద్దని మొత్తుకొన్నా విన్నారు కారు. ఎంత ఉంది అందులో"

"ఇరవైరెండు రూపాయ లున్నయి"

"ఇరవైరెండు రూపాయలూ పోయినై టండీ? మాట్లాడరేమండీ?... నన్ను తగ లెయ్య...అట్లా చూస్తా రేమండీ ... పారే శారు కామాలు. అంతాపోయి నట్లేనా..." అంటూ తెల్లపోయింది కాంతం.

ఏం జెప్పేది? తెల్లమొఖం వేసి "పో యింది, అంతా ఊడ్చుకుపోయిం"దన్నాను. అంతాపోయిందండీ, అంతా పోయిందండీ" అని ఆవిడ కాసేపు విచారపడి, "ఎట్లా పోయిందండీ" అన్నది. "ఆ టిక్కెట్టు తీసు కొనే సందట్లో ఎవరో జేబులోనుంచి లాగే శారు"

"పక్కజేబులో పెట్టారుకామాలు. బని యను జేబులో పెట్టుకోకపోయినారుటండీ"

"అవును మరి. అట్లా జరిగింది. ఏం జేసే ది? ఎన్నిసార్లు ప్రయాణం చేశాను కాను? ఇంతకూ ఆరోజున అల్లాగ దరిద్రం చుట్టు కొన్నది"

"ఎవరు కాజేశారో?"

"ఎవరు కాజేశారో తెలిస్తే వాడ్ని అక్కడే పాతేద్దును. తెలియలేను"

"పరుగెత్తేటపుడు క్రింద ఏమైనా పడి పోయిందేమో వెదికారూ"

"పరుపులో ఏమైనా పెట్టి మరచిపోయి నానేమోనని పరుపు అంతా ఖంగారుగా వెతుకుతుంటే అక్కడున్నవాళ్లు నాఆదుర్దా చూసి 'ఏమిటండీ' అని అడిగారు. నేను ఈవిషయం చెప్పాను. 'క్రింద ఏమైనా పడి పోయిందేమో వెదకండి. వెళ్లి పోలీసుకు రిపోర్టు అయినా ఇవ్వండి' అంటూ చెప్పారు"

"మరి వెతుక్కోరుటండీ. నా ముఖం ఇంతమాత్రం తెలియలేదండీ మీకు"అన్నది. ఆవిడ.

"వెతకటానికి టైము ఏదీ? అప్పటి కప్పుడే రైలు కూసింది. ఇది వెదకటానికి వెడితే రైలు కాస్తా పోతుందని భయం వేసింది. అందుకని ఊరుకొన్నాను."

"అయితే ఇంతకూ పర్సుకోసం వెద కనే లేదన్నమాట."

"ఆఁహ, ఆపెట్టెలోవాళ్లంతా 'దిగి వెళ్లండి, వెతుక్కోండీ' అని తొందర పెట్టారు."

"వెదుక్కోరుటండీ."

"అందుకనే - ఎట్లాగ ఈపరుపుచుట్ట కూడా దింపుకుందామా- ఒకవేళ రైలు ఉండదేమో అని ఆలోచిస్తూ ఉండంగానే, ఒకాయన 'మాస్టారూ, మీబెడ్డింగు నేను చూస్తూఉంటాను. మీరు వెళ్లి వెతుక్కోండి' అన్నాడు. నాకు ఇంకోనిమిషం ఆలోచనకు టైము లేకపోయింది.'ఇదే నాబెడ్డింగు.మీరు జాగ్రత్తచేయండి' అని చెప్పి తొందరగా చూచి మళ్లీ వద్దామని వెళ్లాను. అక్కడ ఎవ్వరూ మనుష్యులూ లేరు; పర్సూ లేదు. సరేనని తిరిగి పరుగెత్తుకుంటూ వచ్చేసరికి రైలు కదిలింది. ఎక్కలేకపోయినాను."

"బాగానే ఉంది. అక్కడ దిగబడి పోయినా రన్నమాట."

"అవును-మరి ఏం జేసేది ? ఆపళంగా వెళ్లి స్టేషనుమాస్టరుతో చెపితే ఆయన - 'ఇక్కడ జేబుదొంగ లున్నారండీ ... రోజూ ఇల్లాంటి రిపోర్టులు వస్తూనే ఉన్నవి' అన్నాడు."

"ఏందరిద్రమండీ! పర్సు పర్సుపాళంగా ఎవరో కొట్టేశారు." అని కాంతం తను కని పెట్టిన విషయం చెప్పింది. నేనేమీ మాట్లాడ లేదు. మళ్లీ అన్నది కాంతం—"నేను అంత పైకం తీసికెళ్లవద్దండీ, నాముఖాన పారేసి వెళ్లండీ అంటే విన్నారూ? బిళ్లకుడుము లాగ ఇరవైరూపాయలూ వాడి ముఖాన పెట్టారు. ఎంత తెలివితక్కువండీ!"

నాకు వళ్లు మండిపోయింది. "నన్ను అనవసరంగా అంటావుగాని, ఇందులో నా తెలివితక్కువ ఏముందమ్మా కాంతం" అన్నాను.

కాంతం ముఖం చిట్లించి,"బారు టిక్కెట్టు కొంటే ఏఅవస్థ లేకపోయేది" అన్నది. అదీ నా తెలివితక్కువ అన్నట్లు.

"పావలాడబ్బులు కలిసొస్తయి అని గదూ నాగోల!"

"నాబొంద పావలా ఇప్పు డేమైంది!"

"ఇల్లా అవుతుందని నేను అను కొన్నానా?" అన్నాను నేను జాలిగా.

కాంతం కూడా నా వంక జాలిగా చూసింది. ఆ చూపులో 'మీ తప్పు ఇం దులో ఏమీ లేదు. పాపం. 'అన్న మాటలు ఉన్నవి.

అల్లాగ ఒక క్షణం చూచి సాను భూతితో "ఏదోలెండి. ఇంతకూ బయలు దేరిన గడియ మంచిదిగాదు. "అని తృప్తి పరచుకొని చివరకు "ఇరవైరూపాయలు గదా-ఏం జేస్తాము. పోతేపోయినైలెండి. ఇబ్బంది పడకుండా వచ్చారా? ఆరాత్రి ఎక్కడున్నారూ? రావటానికి చేతులో డబ్బు ఉన్నదా ఏమైనా- పోయింది పోగా?" అంటూ నాలుగు ప్రశ్నలూ ఆదుర్దాగా అడిగింది.

"చేతులో ఆ టిక్కెట్టు ఒక్కటే— అది మారిస్తే మళ్లీ పావలా వచ్చింది."

"అయితే అవస్థ పడ్డారన్నమాటే!"

"అవస్థ అంటే అవస్థా. నే నెప్పుడూ అంత అగచాట్లు పడలేదు."

"అయ్యో! ఆ రాత్రి తిండీ తిప్పలూ లేవు గాబోలు. ఎవరూ స్నేహితులు లేక పోయినారండీ?"

"ఒక త్యాష్ట్రుడు ఉన్నాడు."

"వెళ్లక పోయినారా ఆయనఇంటికి?"

"వెళ్లాను. ఆయనభార్య కడుపుతో ఉందట. కంటానికి పుట్టింటికి వెళ్లింది. ఆరోజు ఆదివారం కావటంచేత ఆయన కూడా వెళ్లాడు. ఇల్లు తాళం పెట్టి ఉంది."

"ఊఁహూ."

"అన్నీ అల్లాగ కలిసొచ్చినై."

"చాల్లెండి. ఇక ఊరుకోండి."

"ఊరుకోక ఏం జేసేదిలే!...నోరు నొక్కుకుని మరీ ఊరుకొన్నాను. చేతిలో ఉన్న పావలాలో ఒక బేడకు ఏవో అరటి పండ్లూ అవీ కొనుక్కొని తిని ఊరుకొన్నాను. ఇంతకూ ఆ రాత్రి హోటలులో బెంచిమీద పడుకొన్నాను."

"అయ్యయ్యో! ఎంత అవస్థ పడ్డారండీ. మిమ్ముల నెప్పుడూ ఒంటిరిగా ప్రయాణం చేయనీయకూడదు. ఇదే చెపటం—వింటున్నారా? ఇక్కడినుంచి మీరు ఎక్కడికి వెళ్లినా నన్ను తీసికెళ్లండి. మహాబాగుంది మీ అవస్థ...అయితే ఆ పర్సు పోవటం సంగతి నలుగురికీ చెప్పకపోయినారా? మీ కెందుకు చెపుతారూ? ఏం? చెప్పారా?"

"ఎందుకు చెప్పనూ? చెప్పాను."

"ఏమన్నారు?"

"ముందు నా దేవూరైందీ నా కేంపని అయిందీ, నా కెంతజీతం అయిందీ తెలుసుకొన్నారు. తెలుసుకొని 'ఏంపనయ్యా. నూరురూపాయల జీతగాడివి! పావలాకోసం లోభించి స్టేషను స్టేషనులో దిగి టిక్కెట్టు పుచ్చుకొన్నానంటావు' అని చీవాట్లు వేసి 'ఎవరు చెప్పారయ్యా నీ కీబుద్ధీ!' అని అడిగారు. మా ఆవిడ చెప్పిందని అందామనుకొని మళ్లీ ఊరుకొన్నాను నవ్విపోతారని. మర్నాడు ప్రొద్దున్నే గుడివాడకారు ఎక్కి గుడివాడలో ఒక మాస్టరుదగ్గర కావలసిన డబ్బు అప్పుపుచ్చుకొని ఆపళంగా రైలెక్కి వచ్చేశా" అని పూర్తిచేసి, మళ్లీ ఇంకోసిగిరెట్టు వెలిగించాను.

౪

"ఇంతకూ ఆ బెడ్డింగుసంగతేమైంది? అందులోపదిపదిహేనురూపాయల శాలువా, పదిరూపాయల బట్టలూ ఉన్నయిగదా. అది కూడా ఊరేగలేదుగదా" అన్నది కాంతం ఒక్కక్షణం అయినతరువాత.

"నే చెప్పానుగా, ఒకాయన కిచ్చానని"

"చెప్పారు లెండి. ఆయన ఎవరో, ఏ పేటలో ఉంటాడో మీకు గట్టిగా తెలుసా"

"అసలు ఆయనది ఏవూరో కూడా తెలియదు. చూచిన ముఖం!!"

"నాబొంద మీరు చూడని ముఖం అంటూ ఉందిటండీ. ఆయనఎవరో, పేరేమిటో తెలుసుకోకుండా బెడ్డింగు ఎల్లా ఇచ్చారండీ"

"నేను ఇచ్చానా? ఆయన చూస్తూఉంటా నన్నాడు. నేను సరేనన్నాను. పేరూ ఊరూ అడగటానికి వ్యవధీ లేదూ, ఇంతకూ నాకు తోచనూలేదూ - చెప్పద్దూ"

"ఎందుకు తోస్తుంది, అమ్మవారు నెత్తినెక్కి తొక్కుతుంటే — అయ్యో!

అయ్యో! పాతికరూపాయలూ పాడై పోయినై ఆమె. అమ్మాయికి ఇంకా చీర కొందా మనుకొంటున్నా. ఇంకేమి కొనేది? నేను నెత్తిన నోరెట్టుకుని మొత్తుకొన్నా-డబ్బు అంతా తీసికెళ్లబోకండీ అని నా మాట విన్నారూ?"

"పారపాటేనే కాంతం- ఇక్కడనుంచి తప్పకుండా వింటాను చూస్తూండు."

"నాబొంద, ఇదివరకెన్నిసార్లు అన్నారు ఇల్లాగ! తీరా సమయ మొచ్చేసరికి ఎగిరి పడతారామె. సరే లెండి. ఏం అనుకొని ఏం లాభం! పోయిన సొమ్ము రాదుగదా —ఆ బెడ్డింగుకూడా ఎక్కడ పారేశొచ్చారో చెప్పండి — ఊరికే దాచకి. దాన్నికూడా ఒక ఏడ్పు ఏడ్చి ఊరుకొంటాను."

"అప్పుడే తొందరపడివలసిన అవసరం లేదు. పోయిందని గట్టిగా ఇంకా చెప్పలేను. ఆ సంగతి గట్టిగా తెలిసినతరవాత ఇద్దరం కలిసి ఆ కాస్తపనీ చేద్దాము."

"చాల్లెండి. ఊరుకోండి. మీకు చీమ కుట్టినట్లయినా లేదు. పైగా వేళాకోళం ఏమిటండీ!! ఆ బెడ్డింగు సంగతి ఏమైనా కనుక్కోండి."

"మన మేమి కనుక్కోగల్గుం? ఆయన ఎవరో నాకు తెలియదామె. అయితే ఒకటి- ఆయన చాలా పెద్ద మనిషిలాగు కనుపించాడు. తప్పక పంపుతాడు. వస్తుంది. నా మాట నమ్ము."

"మీరు చెప్పిందల్లా నమ్మబట్టే ఈ స్థితికి వచ్చింది సంసారం-" అని కాంతం ఈసడింపుగా మాట్లాడి లేచిపోయింది. అవతల నుంచి మాటలు వినిపిస్తున్నాయి. "ఖద్దరు బట్టలు ఇన్ని వద్దండీ అంటే, అది వెయ్యా ఇది వెయ్యి అని వేధించారు. ఇప్పుడు మళ్లీ కొనగలమా? ఈధరలలో ఎంత లేదన్నాయిరవై రూపాయల సొమ్ము!... ఆ శాలువ మటుకు శాలువ కొన్నప్పుడే పదిహేనురూపాయలు. అంతా యాభై రూపాయలసొమ్ము. తగలేసి వచ్చారు."

"ఆయాభైన్నీ — అ వొక పాతిక మరిచిపోయినావు."

"నాబొంద! పైగా జ్ఞాపకం చేస్తారు కూడా. డెభ్భై అయిదు రూపాయల సొమ్ము పోయిందని ఏమన్నా- ఏంమనిపిబ్బా!... ఆ ఏడు కా ఏడు పైపడ్డకొద్దీ ఎవరికైనా కాస్త జాగ్రత్త తెలుస్తుంది - నూరు రూపాయల సొమ్ము! ఉహూ" అంటూ నిట్టూర్పులు విడుస్తూ సాధిస్తూ కాంతం వంట ఇంట్లోకి వెళ్లి పోయింది.

నేను ఒంటరిగా కూర్చుని ఆలోచించాను ఆపెద్దమనిషి ఎవరై ఉంటాడా అని. సినిమాకథ నడుపుతూ పూర్వవృత్తాంతాన్ని దర్శకుడు చూపేరీతిగా జరిగిన ప్రయాణపు కథ అంతా ఒక్కసారి కళ్లముందుకు తెచ్చుకొన్నాను. ఆయన నాకు ప్రథమంలో నిడదవోలు స్టేషనులో కనిపించాడు-ఎల్లాంటి మనిషీ? చామనచాయ—వెడల్పైన నుదురు-బట్టతల—ఆయనను మళ్లీ గుర్తించటానికి ఇవన్నీ సాయపడతైకదా అని సంతోషించి మరిచిపోకుండాఉంటానికి కాయితంమీద వ్రాసుకొన్నాను. ఆయనను గురించి నాకు ఎటువంటి అభిప్రాయం కలిగిందీ అని రెండో ప్రశ్న వేసుకున్నాను. నాకళ్లముందు ఆయన పర్‌ఫెక్ట్ జెంటిల్‌మెన్‌లాగ కనుపించాడు. నామనస్సును ఎన్నిసార్లు గుచ్చిగుచ్చి అడిగినా అదే సమాధానం వచ్చింది. దాంతో

నాకు మరీ ధైర్యం వచ్చింది పరుపుచుట్ట తప్పక వస్తుందని. మూడో ప్రశ్న-ఆయన ఎవరై ఉంటాడు? ఈ ప్రశ్నకు సరియైన సమాధానం రాలేదు. మొదట నాకు ఆయన నా విద్యార్థులలో ఒకడై ఉంటాడని తోచింది. విద్యార్థి అని ఎందు కనుకున్నానూ అంటే—ఆతరువాత నన్ను మాస్టారూ అని పిలిచాడు కాబట్టి. అయితే దానిమీద రెండు సందేహాలు బయలుదేరినై. మాస్టారూ అని పిలిచినంతమాత్రాన నావిద్యార్థి అనుకుంటానికి వీల్లేదు. ఇప్పుడు మాస్టారూ అని ప్రతివాడ్నీ పిలుస్తారు. రెండోది-ఆయన నా విద్యార్థి అయితే నాకు నమస్కారం పెట్టడా అని. కొందరు విద్యార్థులు నమస్కారం పెట్టకుండా పోవటం కద్దుగాని అది ఉన్న ఊళ్లో సంగతి. ఇన్నాళ్లబట్టీ చూస్తున్నాను, పొరుగూరులో నా విద్యార్థి కనపడితే, నమస్కారం పెట్టక పోయింది లేదు. చివరకు నాకు ఆయన నావిద్యార్థి కాదనీ, ఏదో ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగి అనీ తోచింది. చివ్వరకు వచ్చింది ఆయనది ఏవూరై ఉంటుందీ అన్నప్రశ్న. బెజవాడ, తెనాలి, గుంటూరు ఈ మూడుఊళ్లల్లోనూ నన్ను బాగా ఎరిగున్నవాళ్లు చాలామంది ఉన్నారు. కాబట్టి ఈ మూడుగ్రామాల లోనూ ఎక్కడో ఒకచోట ఆయనను కలుసుకోవచ్చునూ అని తోచింది. చాలా సంతోషం కలిగింది. పొరుగూరైతే, నేను ఈవూళ్లో ఉన్నాననీ, ఫలానివీథిలో ఉన్నాననీ తెలియకపోవచ్చు. ఆపెద్దమనిషికి ఏ దురుద్దేశం లేకపోయినా, ఈభోగట్టా తెలియక పంపలేకపోవచ్చు. కాబట్టి ఈసంగతీ, నా అడ్రెస్సూ ఒక చిన్న ప్రకటనరూపంగా పత్రికలో వేయిస్తే తప్పకుండా లాభిస్తుందని నిశ్చయించుకొని చటుక్కున లేచి వెళ్లి, కాంతంతో చెప్పాను. ఆవిడ "ఊరికే వేస్తారా, ఏమైనా డబ్బు ఇవ్వాలా?" అంది. సుమారు ఓ అయిదారు రూపాయలు కర్చు అని చెప్పాను. ఆవిడ "చాల్లెండి. పైగా అదోదండగ ఎందుకు? ఇయ్యదలుచుకొన్నవాడు ఎల్లాగో కనుక్కొని ఇస్తాడు" అంది.

"ఏగుంటూరో అనుకో ఆయనది. ఆయన గుంటూరునుంచి పనివేళా ఈపరుపు తీసుకొని నాలుగురూపాయలు కర్చుచేసుకొని బందరువచ్చి ఆపరుపు నా కిచ్చి వెడతాడా?" అన్నాను.

"మీదంతా వెర్రిగోల. ఇక్కడికి రావాలా అండీ. మీకు ఉత్తరం వ్రాయకూడదూ? మీఅడ్రసు అసలు ఆయనకు తెలిసే ఉంటుంది. అంతగా తెలియకపోతే ఏ వెర్రివెధవను అడిగినా చెబుతాడు" అన్నది.

"వెర్రివెదవలు గుంటూరులో ఉన్నారంటావా?"

"ఆ. అన్ని ఊళ్లల్లోనూఉంటారు!"

"సరే. అయితే ప్రకటన చేయ వద్దంటావు!"

"వద్దు, ఏమీ వద్దు, ఊరుకోండి. ఇప్పటికి రెండురోజు లైందిగదా. ఇంకా రెండు రోజులు చూద్దాము. వస్తుందా సరేసరి. రాదూ, పర్సుపోయినట్లే ఇదీ పోయిం దనుకొంటాను." అని ఆవిడకు తోచిన హితవు చెప్పింది. చెప్పి "మీదోగోల. పరుపుచుట్ట వస్తుందన్నమాట పట్టిభ్రమ." అని తేల్చిచెప్పేసింది చచ్చులేకుండా.

"నాకుమటుకు పరుపుచుట్ట వస్తుందని ఘట్టి నమ్మకం" అన్నాను. చూద్దాంగా అని ఊరుకొంది కాంతం.

ఆతరువాత నేను బట్టలు వేసుకొని బజారు కెళ్లాను కాఫీ త్రాగటానికి. వీథిలో నడుస్తున్నా, కాఫీహోటల్లో కాఫీ త్రాగుతున్నా నాకళ్లు నాలుగువైపులా తిరుగుతున్నై బట్టతలపెద్దమనిషి ఎవ్వరైనా కనిపిస్తారేమోనని. కళ్లు పీక్కుపొయ్యేటట్లు చూచినా ఒక బట్టతలా కనపడలేదు. కుండుచుట్టూ తిరిగాను ముమ్మారు. ప్రయోజనం లేకపోయింది. ఒక్కబట్టతలమనిషి కనిపిస్తే బాగుండు ననిపించింది.

ఇంతలో ప్రొద్దుగ్రుంకింది. ఇక లాభం లేదని ఇంటి కెళ్లాను ... ఆరాత్రిరాత్రల్లా కాంతం కాసేపు యాభైరూపాయల సొమ్ము పోయిందనీ, కాసేపువందరూపాయల సొమ్ము పోయిందనీ గోలపెడుతూనే ఉంది.

తెల్లవారింది. పిల్లలంతా లేచారు. కాంతం కాఫీ కాస్తున్నది. ఆమెముఖంలో వెదికిచూచినా సంతోషరేఖలు లేవు. ఇంతలో వాకిట్లో ఆడుకొంటున్న పిల్లలు గొల్లున కేకేశారు పెంకులు లేచిపోయేటట్లు. ఏమిటా అని హడిలిపోయి కాంతం ఒక్కగంతేసింది వీథిగుమ్మంలోకి. నేనూ వెనకాలే పరుగెత్తాను. ఏముంది? పరుపుచుట్ట ఒకటి పడేసుంది అక్కడ. ఉప్పరి "బాబూ, కూలి ఆరే ఇచ్చారండి. ఇదిగోనండి చీటీ" అని ఇచ్చింది. పరుపుచుట్ట నాదే! ఆచీటీలో ఏమీ లేదు. నాపేరూ, వీథిపేరూ ఉంది-అంతే.

"ఎవరిచ్చారే ఇది" అనిఅడిగాను నేను. "ఆయన ఎవరో నే నెరగనండి. ఈ పరుపు చుట్ట కార్లకాడ నా కిచ్చి మీ ఇంటికాడ ఇయ్యమన్నారండి. ఆ చీటీ ప్రకారం మీ ఇల్లు కనుక్కున్నానండి." అని అది వెళ్లిపోతుంటే—"ఆయన ఎట్లా ఉంటాడే ఉప్పరీ? ఆయనకు బట్టతల ఉందా" అని అడిగాను. "నాకు తెల్దండీ" అని కేకేసి అది గబగబ వెళ్లిపోయింది.

మేము మొదట కాసేపు తెల్లపోయి, తేరుకుని సంతోషించాము. నిజంగా పోయిన వస్తువ దొరికినప్పుడు ఉన్న ఆనందం మహా గొప్పది. "నే జెప్పలేదూ కాంతం, ఎక్కడికీ పోదు—వస్తుందనీ" అన్నాను నేను గర్వంగా. "ఎవరో ఆయన పెద్దమనిషే" అని మెచ్చుకొంది కాంతం. "ఇంతకూ ఆయన ఎవరైందీ తెలియలేదుగదా" అన్నాను. "ఏదో తమాషాగానే ఉంది. ఈ కాలంలో యాభై రూపాయల సొమ్ము దొరికితే వద్దని ఇచ్చేసే వాడు ఉన్నాడండీ. పెద్దమనిషి. అయితే మటుకు నాకు మాత్రము నమ్మకం కలగటం లేదండీ" అని అని, ఏదో మనస్సుకు హఠాత్తుగా తట్టినదానిలాగ ఉలిక్కిపడి - "నన్నుతమాషాచేయటానికి ఏదైనా నాటకం ఆడారా"అన్నది.

"ఛా, ఏం నాటకం ?"

"ఏముందీ-యిది ఈవూళ్లోనే ఎవరింటిలోనో పెట్టి రెండురోజులైనాక పంపమని చెప్పిఉండకూడదూ."

"ఛాఛా, ఎందుకూ అల్లా చెయ్యటం? అల్లా చేస్తే నా కేం ఒరుగుతుందీ ?"

"ఊ, న న్నేడిపించటానికీ."

"ఎబ్బే... నేనుమటుకు లోపల ఎంత ఇదౌతున్నాను ఇంతసొమ్ము పోయిందే అని-పైకి అల్లా ఉన్నానుగాని."

"కాదులెండి. మీరు మొట్ట మొదటినుంచి చెపుతూనేఉన్నారూ — బెడ్డింగు వస్తుంది బెడ్డింగు వస్తుందీ అని. ఏమిటా ఇల్లా అంటారూ అని నేను సందేహిస్తూనేఉన్నా. దొంగనాటకం ఆడారన్నమాట" అన్నది.

"ఇదేంమాట కాంతం, నన్ను అల్లాగ అన్యాయంగా అంటావు. ఛీ! అల్లాగ ఎప్పటికీ చెయ్యలేదు. ఆయనకు నేను ఫలానా అని తెలిసిఉంటుంది. పంపాడు" అని సిన్సియర్ గా చెప్పాను. కాంతం నమ్మీనమ్మని స్థితిలో ఉంది.

ఇంతలో చిన్నపిల్ల బెడ్డింగు విప్పు తున్నది. విప్పి ఆబట్టలన్నీ అటూ యిటూ పడేస్తుందని "అమ్మా, ఇప్పుడు అది విప్పక, ఆనెక్క చూద్దాం" అన్నాను.

"విప్పనియ్యండి. బట్టలన్నీ ఉన్నయ్యో మో చూద్దాము" అన్నది ఆవిడ. అందులో ఏమైనా తినే వస్తువ ఉందేమోనని వాళ్లు చూస్తున్నారు. అమ్మకూడా విప్పమనటం మూలాన వాళ్లునలుగురూ చేరి, "వద్దే తల్లీ, ఇప్పుడెందుకే" అంటూనేఉన్నా వినక తాళ్లూ అవీ దేని కవి ఊడదీశేశారు. అందులో ఒక మిఠాయిపొట్లం ఉంటే చిన్నపిల్లలిద్దరూ డేగల్లాగ తన్నుకుపోయారు. ఈపొట్లం ఎక్కడిదా, నే నటువంటి దేమీ పెట్టలేదే అని ఆలోచిస్తున్నాను. మరిచిపోయి పెట్ట టానికైనా వీలులేదు. ఎందుకంటే నేనసలు ఎక్కడా కొన్నపాపాన పోలేదు.

ఇంతలో చిన్నమ్మాయి, "యిదెక్క డిది నాన్నా? అక్కయ్యకు కొన్నావా" అంటూ ఒక చీర పైకి ఎత్తింది. "పట్టురెవిక యిదిగోనే అమ్మా" అని పాప రెవికను పరుపుచుట్టలోనుంచి పైకి లాగింది.

నేను ఏమి టీవిచిత్రం అంటూ తెల్ల పోయి చూస్తున్నాను. ఆవిడ ముఖం ఎందుచేతనో కందగడ్డ అయిపోతున్నది. "మిగతా బట్టలు చూపు" అన్నది చిన్నదాంతో. అది ఒక్కొక్కటే ఎత్తి చూపింది. అన్నీ నాబట్టలే! అన్నీ ఉన్నయి!

కాంతం ఏమనుమానపడ్డదో ఏమో మరి నిప్పులుగ్రక్కుతూ తోకత్రొక్కిన పాము లాగ చివ్వున లేచి "ఏమిటండీ?—చీర ఎవరి దండీ? ఎట్లా వచ్చింది ఇది మీపరుపుచుట్ట లోకి ? మాట్లాడరేం?" అంటూ చురచురా చూచింది. నేను ఏమీ చెప్పలేక కళ్లు అప్ప గించి ఊరుకొన్నాను.

కాంతం కత్తులూ, కటారులూ చూపు ల్లో విసరుతూ "ఇంత నాటకం ఆడతారు టండీ-నన్ను పిచ్చిదాన్ని చేసి!" అని కొర కొర చూచింది.

" ఇదేమిటో చిత్రంగానే ఉంది " అన్నాను నేను.

"చిత్రంగా ఉండదూ ! ఎట్లా వచ్చింది ఇది మీ బెడ్డింగులోకి?" అని అడిగింది ఆవిడగారు.

" అదే నేనూ ఆలోచిస్తున్నాను " అన్నాను.

"ఆలోచిస్తారు ! ఆలోచించరూ మరి ! నంగనాచిలాగ చూడబోకండి. ఏమిటో అన లుసంగతి చెప్పండి" అన్నది. నే నేమీ చెప్పలేకపోయినాను. కాంతం నన్ను అను మానిస్తున్న దని నేను గ్రహించాను. కాని ఏమి చెప్పినా నమ్మించలేను. అందుకని "రామ, రామ! నే నేమీ ఎరగను" అని ఇంత అపనింద పైబడ్డందుకు సిగ్గుపడి దిగు లుతో లోపలికి వెళ్లిపోయి పరుపుమీద

బొక్కబోర్లా పడుకొన్నాను. రెండు నిమిషాలైందో లేదో ఎవరో వీథిగుమ్మంలోకి వచ్చినట్లు చప్పుడైంది. "మాస్టరుగారు ఉన్నారాండి"అన్నారు ఎవరో. "ఆ, ఉన్నా" రన్నది కాంతం. "మరేమీ లేదండీ. యిదుగో యిక్కడే ఉందే ఈపరుపుచుట్ట! నాకు కైకలూరుస్టేషనులో మాస్టారు ఈ పరుపుచుట్ట యిచ్చి ఆయన దిగబడిపోయినారు. నేను గుడివాడలో దిగానులెండి. దిగి మాఅమ్మాయిగారింట్లో రెండురోజు లుండి యివ్వాళే అమ్మాయిని వెంటబెట్టుకొని వచ్చాను కారుమీద. ఈపరుపుచుట్ట నాదే అనుకొని యిందులో చీర ఒకటి పెట్టిందట మా అమ్మాయి. యిప్పుడే చెప్పింది. తీసుకెడదా మని వచ్చానండి" అన్నాడు ఆ వచ్చిన పెద్దమనిషి.

"ఇదుగోనండి మీచీర. ఎక్కడిదా అని నేనూ చూస్తున్నాను. ఇవ్వవే అమ్మాయి" అని కాంతం అనటం వినిపించింది. "నాన్నను పిలు అమ్మా" అని కూడా అన్నది. అమ్మాయి వచ్చి నన్ను పిలిచింది. నేను వెళ్లి ఆయన్ను గుర్తించిపరుపుచుట్ట జాగ్రత్తగా పంపినందుకు నమస్కరించాను. ఆయన"మాస్టారూ, క్షమించాలండీ. పాపం ఈ రెండు రోజులూ మీరు పరుపుచుట్టకోసం ఆదుర్దా పడిఉండాలె!" అన్నాడు. నేను "ఏమీ ఆదుర్దాపడలేదండి. ఎక్కడికి పోతుంది" అన్నాను. "గుడివాడలో మా అమ్మాయిగారింటికెళ్లాను. అక్కడ రెండు రోజు లుండాల్సివచ్చింది" అంటూ మళ్లీ నాకు ఆకథ అంతా చెప్పి సెలవు పుచ్చుకొని వెళ్లిపోయినాడు.

నన్ను కాంతం అనవసరంగా అనుమానించినందుకు నాకు వళ్లు మండిపోతున్నది. అందుచేత నేను ఆమెవైపు అన్నా చూడకుండా గబగబా వెళ్లిపోయి మళ్లీ ప్రక్కమీద పడుకొన్నాను. పది నిమిషాలు గడిచింది. గాజుల చప్పుడైంది. నేను గిరుక్కున అటు తిరిగాను. ఆవిడ వచ్చి ప్రేమ వుట్టిపడే కంఠంతో "కాఫీ యిస్తాను రండి" అంది. నేను మాట్లాడలేదు. ఆమెవంకైనా చూడలేదు. ఆమె నా బుజాలు పట్టుకొని తిప్పటానికి ప్రయత్నిస్తూ "రండీ! పిల్లలుకూడా కాఫీ త్రాగకుండా కూర్చున్నారు మీకోసం" అన్నది. "నన్ను అన్యాయంగా అనుమానించావుగా నీవు" అన్నాను నేను రుద్ధకంఠంతో. అని పసిపిల్లవాడిలాగ ముడుచుకొని పడుకొన్నాను. నాచెక్కిళ్లు నొక్కుతూ "మనస్సు పాపిష్ఠిదండీ. ఆడదాని మనస్సు వట్టి పాపిష్ఠిది. ఏమిటో వెధవ ఆడపుటక!" అంటూ కాఫీ కప్పు నాకు అందించింది మా కాంతం.